ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM
PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్యశోధనే మా లక్ష్యం...

ఆంధ్రప్రదేశ్ (క్రిష్ణ) గురువారం 09-07-2026 సంపుటి: 01 సంచిక : 5 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Andhrapradesh(Krishna) Thursday 09-07-2026 Volume :01 Issue: 5 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు

## దద్దరిల్లిన కువైట్, బహ్రెయిన్..



- సైరన్ల మోతలతో ఉలిక్కిపడుతున్న పశ్చిమాసియా
- ఇరాన్‌లోని 80 లక్ష్యాలపై అమెరికా దాడులు..
- 85 అమెరికా స్థావరాలపై విరుచుకుపడిన టెహ్రాన్
- ఎంఓయూ కథ ముగిసింది : ట్రంప్
- ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

జనరల్ డెస్క్

మధ్యప్రాచ్యం మరోసారి దాడులతో దద్దరిల్లింది. అమెరికా సేనలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఏకంగా 80 ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేశాయి. అమెరికా దాడులపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. దాడులకు తగిన విధంగా జవాబిస్తానని హెచ్చరించింది. కువైట్, బహ్రెయిన్ లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే బహ్రెయిన్, కువైట్‌లలో గగనతల రక్షణ

-మిగతా 2 లో




# ఎగిసిన ముడి చమురు ధరలు

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తత.. చమురు ధరలకు రెక్కలు
- బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు 5 శాతంపైగా జంప్
- ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై ప్రభావం
- భారత్‌లోనూ పెరగనున్న ధరల భారం

వాషింగ్టన్ :

అమెరికా--ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బుధవారం ఐదు శాతానికిపైగా ఎగిశాయి. ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో పాటుగా ఇకపై ఇరాన్ నాయకత్వంతో చర్చలు కొనసాగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాల ప్రభావంతో అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుటిఐ) ముడి చమురు ధర బ్యారెల్‌పై ధర 5.8 శాతం ఎగిసి 74.50 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌పై 5.65 శాతం ఎగిసి 78.35 డాలర్లుగా నమోదయ్యింది. జూన్‌లో రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గి వాణిజ్య నౌకల

-మిగతా 2 లో



# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

- సర్కార్ బడుల్లో చదువుతున్నది 28శాతమే
- తాజాగా యూడైస్ ప్లస్ 2025-26 నివేదిక వెల్లడి
- రానురాను పూర్తిగా ఖాళీ అవుతున్న ప్రభుత్వ బడులు
- రాష్ట్రంలో 4,793 సింగిల్ టీచర్ పాఠశాలలు
- విద్యుత్తు కనెక్షన్లు లేని సర్కార్ బడులు 180


హైదరాబాద్,

: రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో చదివే విద్యార్థుల్లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు కేవలం 28 శాతం మాత్రమే ఉన్నారు. అంటే 70.43 శాతం మంది ప్రైవేట్ బడులకు వెళ్తున్నారు. రానురాను ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ మరింత తగ్గే ప్రమాదం పొంచి ఉన్నది. Geographic Reference ఈ విషయాన్ని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్ ఎడ్యుకేషన్ ప్లస్ 2025-26 నివేదిక తాజాగా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2025-26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 6,39,730 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. వీరిలో కేవలం1,83,974 (28 శాతం) మంది మాత్రమే సర్కార్ బడుల్లో ఒకటో తరగతిలో చేరారు. ఎయిడెడ్ బడుల్లో 4,997(0.78శాతం) మంది మాత్రమే ఉన్నారు. అదే ప్రైవేట్ స్కూళ్లల్లో ఏకంగా 4,50,578 (70.43శాతం)

-మిగతా 2 లో

# డైట్ చార్జీల పెంపు

## హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచి వర్తింపు



- హాస్టళ్లు కాదు.. ఇక గురుకులాలనే నిర్మిద్దాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల మరమ్మతులు
- బడుగుల జీవనోపాధికి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు పీ4 అనుసంధానం
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఏపీ బ్యూరో:

బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ చార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై ఆయన బుధవారం సమీక్షించారు. విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని.. వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా, ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ చార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం డైట్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుంది. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలి. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో

-మిగతా 2 లో



# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

- ప్రయివేటురంగంలో ఖమ్మంలో ఏర్పాటు
- సీఎంతో భేటీ అయిన గోద్రేజ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఆయిల్‌పామ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్(కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి తెలిపారు. బుధవారం వారు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్చార్డీ)లోని బోధి పెవిలియన్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోద్రేజ్ ప్రతినిధులు తమ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఖమ్మం జిల్లాలో ప్రయివేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. దీనిపై పలు కీలక అంశాలపైన చర్చలు జరిపారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటువుతున్న ఈ ప్రాజెక్ట్

-మిగతా 2 లో




# విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలి

- దళితవాదం పేరుతో దేవుళ్లపై వ్యాఖ్యలు సరికాదు
- మత చిచ్చు రేపే శక్తులపై చర్యలు తీసుకోవాలి
- ప్రజల్లో సామరస్యం పెంపొందించాలి
- దళితులను రాజకీయ ప్రయోజనాలకు వాడొద్దు
- దళిత సాధికారతకు కృషి చేయాలి
- సామాజిక న్యాయం, అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యం
- ఎస్సీ మోర్చా కార్యక్రమాలపై సమీక్ష
- దళితవాదం పేరుతో హిందూ దేవుళ్లను దూషిస్తున్నారు: మాధవ్

అమరావతి,విజయవాడ,

'రాష్ట్రంలో విద్రోహ శక్తులు కుట్రలు చేస్తున్నాయి. దళితవాదం పేరుతో హిందూ దేవుళ్లను దూషిస్తున్నాయి. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు మత చిచ్చు రేపేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి శక్తులను సమాజం తిప్పికొట్టాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల వర్క్‌షాపులో మాధవ్ మాట్లాడారు. ప్రభుత్వాలను విమర్శించొచ్చు కానీ... విద్వేష అజెండాతో ఉగ్రవాదాన్ని భుజాన వేసుకుంటాం, ప్రజల్లో మత చిచ్చు రేపుతాం అంటే సహించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ తమ మతాన్ని ఆరాధించుకోవచ్చని, ఇతర మతాల దేవుళ్లను అగౌరవపరిస్తే చట్టం చూస్తూ ఊరుకోదని చెప్పారు.

-మిగతా 2 లో

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

- భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం
- నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు
- అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు
- కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు

2

లక్షలాది మంది నివాళులతో వీడ్కోలు





# దేశంలో కోటి దాటిన ఉపాధ్యాయుల సంఖ్య

- 14 లక్షల స్కూళ్లు, 24 కోట్ల మంది విద్యార్థులు..
- కేంద్ర నివేదిక వెల్లడి
- డ్రాపౌట్ శాతం 1.8కు తగ్గిందన్న కేంద్రం
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల నమోదు
- ప్రైవేటు స్కూళ్ల వైపు పెరుగుతున్న మొగ్గు

న్యూఢిల్లీ

దేశంలో 1.02 కోట్ల మంది టీచర్లు, 14.66 లక్షల స్కూళ్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు దేశంలోని స్కూళ్లకు సంబంధించి యూడీఐఎస్ఈం (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) 2025-26 రిపోర్టును కేంద్ర విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. దేశంలోని స్కూల్స్, టీచర్లు, విద్యార్థుల సంఖ్య, డ్రాపౌట్లు వంటి అంశాల్ని ఈ నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2025-26 విద్యా సంవత్సరంలో 1.02 కోట్ల (1,02,73,020) మంది టీచర్లున్నారు.అలాగే 14.66 లక్షల స్కూళ్లు (14,66,682) పనిచేస్తుండగా, 24.72 కోట్ల (24,72,19,766) మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో

-మిగతా 2 లో

# "మావిగన్ అంటే ఏ బస్సు ఎక్కాలి?"

## జనం నవ్వుకుంటున్నారు



- జగన్ ఎత్తుగడను నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- అనుకున్న సమయానికి అమరావతి తొలిదశ పనులు పూర్తి
- మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి
- ప్రాజెక్టులవారీగా కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష

ఏపీ బ్యూరో

మాజీ సీఎం జగన్ ప్రస్తావిస్తున్న "మావిగన్" రాజకీయ ఎత్తుగడను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, "మావిగన్ అంటే ఏ బస్సు ఎక్కాలంటూ ప్రజలే నవ్వుకుంటున్నారు" అని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఎద్దేవా చేశారు. ప్రజలకు పరిపాలన సులభతరం చేసేందుకు అన్ని ప్రభుత్వ వ్యవస్థలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేస్తుంటే, దీనిపై అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం అమరావతిలో రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా తొలిదశ

-మిగతా 2 లో

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు




మొదటి తరువాయి

వ్యవస్థలను క్రియాశీలకం చేశారు. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకంగా ఉన్న ఖర్గ్ దీవిలో పేలుడు శబ్దాలు వినిపించాయి. అలాగే ఓడరేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్‌లతో పాటు ఖెష్మ్ దీవిలో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్‌పై జరిగిన దాడిలో అనేక మంది గాయపడ్డారని తెలుస్తోంది. బందర్ అబ్బాస్‌లో మత్స్యకారులకు చెందిన అనేక పడవలు దగ్ధమయ్యాయి. దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి ఖ్వోమ్ నగరంలో లక్షలాది మంది నివాళులు అర్పించిన మరునాడే అమెరికా ఈ దాడులకు దిగడం గమనార్హం. ఇరాన్‌తో కుదుర్చుకున్న ఎంఓయూ కథ ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టర్కీలో చెప్పారు.

ఇరాన్‌ను దెబ్బతీసేందుకే : సెంట్‌కామ్

'మా దళాలు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, కమాండ్-కంట్రోల్ వ్యవస్థలు, కోస్తా రాడార్ కేంద్రాలు, నౌకా క్షిపణి విధ్వంసక సామర్థ్యాలపై దాడులు చేశాయి. హార్మూజ్ సమీపంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కు చెందిన అరవై చిన్న పడవలపై కూడా దాడి జరిపాయి' అని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఓ ప్రకటనలో వివరించింది. ఒప్పందానికి కట్టుబడి ఉండకపోయినా లేదా దానికి విధేయత చూపకపోయినా ఇరాన్‌ను బాధ్యురాలిని చేసేందుకు తమ దళాలు సిద్ధంగా ఉంటాయని చెప్పింది. ఇరాన్‌ను తీవ్రంగా నష్టపరచడమే ఈ దాడుల ఉద్దేశమని తెలిపింది. ఇరాన్ దళాల అవాంఛనీయ దుందుడుకు చర్యలు కాల్పుల విరమణకు తూట్లు పొడిచాయని, హార్మూజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించకుండా అడ్డుకున్నాయని ఆరోపించింది. కాగా పర్షియన్ గల్ఫ్‌లోనూ, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోనూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీరంలో బుధవారం ఉదయం పదికి పైగా అమెరికా యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాయి.

ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

'అమెరికా దూకుడుకు, ఉగ్రవాద చర్యలకు మా సాయుధ దళాలు తగిన విధంగా జవాబిస్తాయి. అమెరికా దాడులను సమర్థవంతంగా తిప్పికొడతాయి' అని ఇరాన్‌కు చెందిన ఖతమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయం తెలిపింది. హార్మూజ్ జలసంధి నిర్వహణలో కానీ, వ్యవహారాలలో కానీ ఇతరుల జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ నిర్దేశించిన మార్గాలలో ప్రయాణించే నౌకలు మాత్రమే సురక్షితంగా ఉంటాయని చెప్పింది. తమతో కుదుర్చుకున్న ఎంఓయూను అమెరికా ఉల్లంఘిస్తోందని ఇరాన్ శాంతి చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ ఆరోపించారు. 'బెదిరింపులు, దోపిడీల కాలం చెల్లిపోయింది. మేము ఎవరికీ తలవంచం' అని ఆయన చెప్పారు. దేశ ప్రయోజనాలను, భద్రతను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇరాక్ వెళ్లిన దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తాజా పరిణామాల నేపథ్యంలో హుటాహుటిన స్వదేశానికి చేరుకున్నారు.

# ఎగిసిన ముడి చమురు ధరలు

మొదటి తరువాయి




రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ.. తాజా సైనిక చర్యలతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌కు ఇచ్చిన ఆంక్షల సడలింపును కూడా అమెరికా రద్దు చేయడంతో ప్రపంచ ఇంధన సరఫరాపై అనిశ్చితి నెలకొంది. చమురు ధరల తాజా పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలో ఇప్పటికే ఇంధన ధరలు అధిక స్థాయిలో ఉండగా.. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణ నియంత్రణతో పాటు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌లోనూ ధరలు పెరగడంతో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

మొదటి తరువాయి

మంది చేరారు. కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాలు ప్రభుత్వ విద్యపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో అమ్మాయిలు, అమ్మాయిల చదువులపై ఇంకా వివక్ష కనిపిస్తున్నది. అబ్బాయిలను ప్రైవేట్‌కు, అమ్మాయిలను సర్కార్ బడులకు పంపిస్తున్న ఉదంతాలు కనిపిస్తున్నాయి. సర్కార్ బడుల్లో అబ్బాయిలతో పోల్చితే లక్ష మంది అమ్మాయిలు ఎక్కువగా చదువుతుంటే, ప్రైవేట్‌లో అమ్మాయిలతో పోల్చితే అబ్బాయిలు నాలుగు లక్షల మంది ఎక్కువగా చదువుతుండటం గమనార్హం.

# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

మొదటి తరువాయి



ద్వారా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రం , సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమి ని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎంను కోరారు. అలాగే ప్రాసెసింగ్ మిల్ కోసం రాహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు.

# 'డైట్ చార్జీల పెంపు"

మొదటి తరువాయి

పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకే డైట్ చార్జీలు పెంచుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ధి చేకూరే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలి..' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు..

సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్ కు దీటుగా తీర్చిదిద్దాలని చెప్పారు. 'హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం



చేపట్టేందుకు పెద్దపీట వేయాలి. రెసిడెన్షియల్ స్కూళ్లలో నెట్ జీరో విధానాన్ని అమలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విశ్లేషించాలి. బయో డైవర్సిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలి. మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో గురుకులాలను నిర్మించాలి. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ ఇవ్వాలి. దీని నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం..' అని సీఎం ప్రకటించారు.

పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి..

'హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలి. పోటీ పరీక్షలకు గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను సిద్ధం చేయాలి.'

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

**-భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం**
**-నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు**
**-అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు**
**-కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు**



టెహ్రాన్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు గురువారం జరగనున్నాయి. ఖననం కోసం ఆయన భౌతికకాయాన్ని ఇరాన్‌లోని మషద్‌కు తరలించడానికి ముందు, ఇరాన్లో జరుగుతున్న వీడ్కోలు ప్రదర్శన చివరి దశకు చేరుకున్నది. నజాఫ్‌లోని ఇమామ్ అలీ పవిత్ర పుణ్యక్షేత్రానికి దారితీసే వీధులు లక్షలాది మంది సంతాప వ్యక్తీకర్తలతో కిక్కిరిసిపోయాయి. తమ నాయకుడికి వీడ్కోలు పలుకుతూ అక్కడి ప్రజలు 'ఓ హుస్సేన్, మేం నీ సేవలో ఉన్నాం','ఓ ఖమేనీ, మేం నీ సేవలో ఉన్నాం" అంటూ నినాదాలు చేశారు. మరోపక్క నజాఫ్‌లోని కుఫా వంతెన నుంచి పవిత్ర పుణ్యక్షేత్రాల వైపు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ యాత్ర ప్రారంభమైందని మీడియా సంస్థలు నివేదించాయి. నైజీరియాలోని ఇస్లామిక్ ఉద్యమ నాయకుడు షేక్ ఇబ్రహీం జక్జాకీతో సహా పలువురు ప్రముఖులు ఈ భారీ జనసందోహంలో పాల్గొన్నారు. ఆయన నజాఫ్‌లో సంతాప వ్యక్తీకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాత్రలో చాలా మంది యువ నిరసనకారులు ప్రతీకార చర్యకు సంకేతంగా ఎర్ర జెండాలను ప్రదర్శిస్తూ 'మేము ఎప్పటికీ అవమానానికి తలవంచం', 'అల్లాహు అక్బర్' (దేవుడు గొప్పవాడు) అంటూ... అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు.

కర్బలాలో ఊరేగింపులు

అయతుల్లా ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు పవిత్ర నగరమైన కర్బలా వరకు విస్తరించాయి, అక్కడ రెండు పవిత్ర పుణ్యక్షేత్రాల మధ్య ప్రాంతం భారీ సంఖ్యలో ప్రజలతో నిండిపోయింది. ఇరాన్ , టర్కీ నుంచి వచ్చిన యాత్రికులతో పాటు, స్థానిక మార్కెట్లు , దుకాణాలు ఖమేనీ చిత్రపటాలతో అలంకరించబడ్డాయి.

అయతుల్లా ఖమేనీ కుటుంబ సభ్యులు ఇమామ్ హుస్సేన్ , హజ్రత్ అబ్బాస్ ల భౌతికకాయాలు పుణ్యక్షేత్రాలలో చివరి ప్రార్థనల కోసం కర్బలాకు చేరుకున్నాయి. అంత్యక్రియల ఊరేగింపును స్వీకరించడానికి కర్బలా ప్రావిన్స్‌లో దాదాపు 7 మిలియన్ల మంది సంతాపకులు తరలివచ్చినట్టు ప్రాథమిక అంచనా.

# విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలి

మొదటి తరువాయి

రాష్ట్రంలో దళితులను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాధవ్ విమర్శించారు. దళితుల అభ్యు న్నతికి చిత్తశుద్ధితో పనిచే యాల్సిన అవసర ముందన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంప్రదాయ డప్పు కళాకారులు, వారి కళను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా, హిందూ ధర్మాన్ని అవమానించేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో దళిత సాధికారత, సామాజిక న్యాయం, అంబేద్కర్ ఆశయాల సాధన కోసం మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ మోర్చా చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించారు.




# దేశంలో కోటి దాటిన ఉపాధ్యాయుల సంఖ్య

మొదటి తరువాయి



డ్రాపౌట్ శాతం తగ్గి, 1.8గా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో స్కూళ్లలో విద్యార్థుల డ్రాపౌట్ శాతం 2.3 శాతంగా ఉండేది. మరోవైపు టీచర్ల సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. 2022-23లో 94.8 లక్షల మంది టీచర్లు పనిచేయగా, 2024-25లో 1.01 కోట్ల మంది టీచర్లు స్కూళ్లలో పని చేశారు. ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటడాన్ని దేశ పాఠశాలల చరిత్రలో గొప్ప విజయంగా కేంద్ర విద్యాశాఖ అభివర్ణించింది. కేంద్రం అమలు చేస్తున్న సమగ్ర శిక్ష, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ద్వారా ఇది సాధ్యమైందని తెలిపింది. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య కూడా తగ్గినట్లు వివరించింది. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం మాత్రం తగ్గింది. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో 12.1 కోట్ల మంది నమోదు చేసుకోగా, 2025-26లో 11.8 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య దాదాపు 30 లక్షలు పెరిగింది. దేశంలో సింగిల్ టీచర్ స్కూల్స్ 3 శాతం ఉన్నాయి. వీటిలో చాలావరకు విద్యార్థుల నమోదు శాతం సున్నాగా ఉంది. ఇలా ఒక్క విద్యార్థి లేని పాఠశాలల శాతం 2గా ఉంది.

# "మావిగన్ అంటే ఏ బస్సు ఎక్కాలి?''




పనులను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ భవనాలు, రహదారులు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) లేఅవుట్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి, నిర్ణయించిన గడువులోనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం..

అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ, ఐకానిక్ భవనాల నిర్మాణ వ్యయాన్ని సాధారణ భవనాలతో పోల్చి కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అమరావతిని దోమలు లేని ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు భూగర్భ మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే క్వార్టర్స్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ నెలాఖరులోగా ఎమ్మెల్సీ, ఐఏఎస్ టవర్ల నిర్మాణం కూడా పూర్తవుతుందని వెల్లడించారు. పూర్తయిన భవనాలను సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తామని, అనంతరం నిబంధనల ప్రకారం కేటాయింపులు జరుగుతాయని చెప్పారు. ఈ సమీక్షలో అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మి పార్థసారథి, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూటుపల్లి రైతులకు ఊరట

**-నిషేధిత జాబితా నుండి 2074 ఎకరాలు తొలగింపు**

**-రైతుల సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్**

**-గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని వెల్లడించిన మైనారిటీ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్**

**అమరావతి, జూలై09(నేటి దర్శిని)**
నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం బేతంచర్ల మండలంలోని గూటుపల్లి గ్రామ భూములకు నిషేధిత భూముల జాబితా నుండి విముక్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూటుపల్లి పరిధిలో నిషేధిత జాబితాలో కొనసాగుతూ వస్తున్న 2074.59 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ జీవో నెంబర్ - 77ను బుధవారం ప్రభుత్వం జారీ చేసింది. రైతుల వినతి మేరకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని గూటుపల్లి గ్రామ పరిధి లోని 142 సర్వే నెంబర్లలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసినట్లు మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

**వక్ఫ్ ఆస్తుల జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు**

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రెవిన్యూ శాఖలో తీసుకున్న అసంబద్ధమైన నిర్ణయాలతో రైతులకు సంబంధించిన, సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత 22ఏ జాబితాలోకి చేర్చడం తో పట్టాదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడిన విషయం




తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామ పరిధిలోని భూములు కూడా ఆనాడు 22ఏ జాబితా లోకి చేరాయి. గ్రామంలో ఉన్న 215 సర్వే నంబర్లను (195 పట్టా భూములు, 18 సర్వీస్ ఇనామ్ భూములు మరియు 2 ఎండోమెంట్ భూములు) రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఎ(1)(సి ) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితాలో వక్ఫ్ ఆస్తులుగా చేర్చారు. దీని ఫలితంగా దాదాపు 1,000 మంది ఖాతాదార్లు రిజిస్ట్రేషన్లు, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు పడుతూ వచ్చారు. గూటుపల్లి సమస్య మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వద్దకు వచ్చింది. వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకుబ్ భాషా లను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విచారణ చేసిన అధికారులు గూటుపల్లి గ్రామంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చబడి, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని నివేదించారు. ఫలితంగా 142 సర్వే నంబర్లలోని 2074.59 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22-ఎ(1)(సి) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని ఆదేశిస్తూ జీవో నెంబర్ -77 ను ప్రభుత్వం జారీ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న మరో 613.84 ఎకరాల విస్తీర్ణం గల మిగిలిన 74 సర్వే నంబర్ల విషయంలో తదుపరి సవివరమైన పరిశీలన మరియు ధృవీకరణ అవసరముందని, త్వరలో దీనిని కూడా పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి ఉత్తర్వులు జారీ చేసిందని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా తమ గ్రామ సమస్యను, రైతుల ఇబ్బందులను ప్రత్యేకంగా గుర్తించి నిషేధిత జాబితా నుండి తమ భూములను తొలగించడం పట్ల గూటుపల్లి రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజా భద్రతకు 'మూడో కన్ను' సీసీ కెమెరాలు:

**-సీసీ కెమెరాల ఏర్పాటుకు తనకల్లు పోలీసుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ**

**తనకల్లు, జూలై09(నేటి దర్శిని)**
సత్యసాయి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి, కదిరి రూరల్ సీఐ నాగేంద్ర పర్యవేక్షణలో తనకల్లు ఎస్సై పి. దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది మండలంలో ప్రజా భద్రత బలోపేతం కోసం సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ప్రజలను చైతన్యపరుస్తూ విరాళాల సేకరణ నిర్వహిస్తున్నారు. తనకల్లు మండలంలోని జాతీయ రహదారి ప్రధాన జంక్షన్లు, టి.జంక్షన్లు, హైవే ఎంట్రన్స్-ఎగ్జిట్ పాయింట్లు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు, నేరస్థులు తప్పించుకునే రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటివలన



దొంగతనాలు, హిట్ అండ్ రన్ కేసులు, చైన్ స్నాచింగ్స్, ఇతర నేరాల విచారణ సులువవుతుంది. మిస్సింగ్ కేసులలో వ్యక్తుల కదలికలను, సరిహద్దులు దాటి పారిపోయే నేరస్థుల ప్రయాణ మార్గాలను వేగంగా గుర్తించవచ్చు అని తెలిపారు. కోక్కంటి క్రాస్ మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు (షబ్బీర్, సుబ్బయ్య, ప్రసాద్, గిరి, దేవేంద్ర, సోము, శంకరరావు, శీనా, కృష్ణారెడ్డి, ముస్తఫా, అఖిల్, కిరణ్, మస్తాన్) రూ.86,700/- విరాళాన్ని కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామికి అందజేశారు. తనకల్లు మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు రూ.30,000/- విరాళం అందజేశారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, రద్దీ ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇంటి యజమానులు తమ ఇళ్ల ముందు, వ్యాపార సంస్థలు తమ దుకాణాల వెలుపల రహదారి కవర్ అయ్యేలా కెమెరాలు అమర్చుకోవాలని సురక్షితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని సీసీ కెమెరాలు సమాజంలో మూడో కన్నుగా పనిచేస్తాయి. ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం ప్రజలందరూ తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, గ్రామాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని పోలీసులు తెలియజేశారు

## కాట్రేనికోన ఉన్నతపాఠశాలలో దాతలు నిర్మించిన డైనింగ్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

**కోనసీమ,జూలై09(నేటి దర్శిని)**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన కాట్రేనికోనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సత్యవతి మెమోరియల్ డైనింగ్ హాల్‌ను శాసనసభ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ తమ తల్లి సత్యవతి స్మారకార్థం ఆమె కుమారులు రూ.10 లక్షల వ్యయంతో ఈ డైనింగ్ హాల్‌ను నిర్మించి విద్యార్థులకు అంకితం చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. సమాజ సేవా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నప్పటికీ, దాతలు మరియు సేవాభావం కలిగిన కుటుంబాలు ముందుకు వచ్చి విద్యాసంస్థల అభివృద్ధికి తోడ్పడటం ఎంతో





గొప్ప విషయమని తెలిపారు. సమాజంలో స్థిరపడిన ప్రతి ఒక్కరూ తమ గ్రామాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ డైనింగ్ హాల్ ద్వారా విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేసే అవకాశం కలుగుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగిడి నాగేశ్వరావు,ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ, సీనియర్ నాయకులు వనచర్ల నాగేశ్వరరావు,వెసింగి రంగారావు వర్మ,వెంట్రు సుధీర్,ఇసుకపట్ల రాంబాబు,దండుప్రోలు సత్యం, మోకా అప్పాజీ,మోకా బాల ప్రసాద్, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలి

**కాకినాడ,జూలై09(నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో జెండర్ కమిటీ సభ్యులకు మరియు మహిళా పీర్ గ్రూప్ సభ్యులకు చట్టాలు,ప్రయోజనాలు మరియు పరిష్కార యంత్రాంగంపై అర్ధ సంవత్సర సమర్థతల నిర్మాణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ మహిళా




చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని,తద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గృహహింస నిరోధక చట్టం, ఫోక్సో చట్టం,వరకట్న నిరోధక చట్టం,బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూజిత మాట్లాడుతూ చట్టాల ఫలితంగా లభించే ప్రయోజనాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విమల,జ్యోతి మాట్లాడుతూ మహిళా సమస్యలు పరిష్కార యంత్రాంగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని స్త్రీ పురుషులు పాల్గొన్నారు.

## చిప్పగిరిలో ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 77 వ జయంతి వేడుకలు



**చిప్పగిరి, జూలై09(నేటి దర్శిని)**
కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ లో బుధవారం వైసిపి మండల కన్వీనర్, ఉనేబాదు మల్లికార్జున ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య హాజరయ్యారు.దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వచ్చిన రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య మాట్లాడుతూ నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశ్రీ పథకశీ తెచ్చిన మహా నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని,ప్రజల కన్నీటిని తుడవడానికి తాను ఉన్నా డంటూ.. కోట్లాది మందికి భరోసా ఇచ్చిన నాయకుడు డాక్టర్ వైయస్ఆర్ అని ,ప్రతిపక్షంలో ఉన్నా.. పాలక పక్షంలో ఉన్నా.. ఆయన ఎప్పుడూ ప్రజల పక్షమే నిలిచిన మహానేత అని, వైయస్సార్ ను మరొకసారి స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో వైసిపి అనుబంధ విభాగం రాష్ట్ర పంచాయతీ వింగ్ ఉపాధ్యక్షులు ఓబులేసు, కో - కన్వీనర్ కొండా శేఖర్, సత్తిరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, మండల అబ్జర్వర్ ఈశ్వరయ్య, మాజీ సర్పంచులు నాగేంద్ర, సేనాపతి, మాజీ వైస్ సర్పంచ్ హనుమంతు, బంటనహాళ్ రమేష్, చందు, దౌల్తాపురం దామోదర్,గుమ్మనూరు హనుమంతు,తిమ్మాపురం ఓబులపతి,శేఖర్,నేమకల్, జీ పురం నాగరాజు, వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పథంలో పాల్గొన్న అధికారులు, కూటమి నాయకులు





**చిట్వేల్, జూలై09(నేటి దర్శిని)**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్వేల్ టౌన్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించారు. అలాగే పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచడం ద్వారా దోమలు, అంటువ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మాదాసు నరసింహ, టీడీపీ నాయకుడు బొంతల నాగేశ్వరరావు, జనసేన యువ నాయకులు మద్దూరి మన్మధ, పెద్దవెంగారి సాయి,కావేరి అవినాష్, నాయిని సురేంద్ర, కొనిశెట్టి చక్రి, మాదినేని రాజా, కొనిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై పరిసరాలను శుభ్రపరిచారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అధికారులు, నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది.

## గాడిమొగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ ర్యాలీ




**కాకినాడ, జూలై08(నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం,డెంగ్యూ నివారిద్దాం అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి పి ప్రకాష్,ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్యామల, డాక్టర్ రత్నకుమార్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బి ఎల్ జి కుమార్,రంజన్,నాగమణి,బివిల్ శ్రీను,అభినవ, గోవిందు, మోహన, ఆదినారాయణ, కే ఆంజనేయులు, కేన్ ప్రసాదు, సిహెచ్ బాలకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్..

## - టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి.గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్

## 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్..




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి'. ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్.ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# అల్లు అర్జున్ 'రాకా'లోఛాన్స్ మిస్ చేసుకున్న బ్లాస్ట్ బ్యూటీ..

## -అసలు కారణం చెప్పిన అట్లీ!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణె కథానాయికగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ బడ్జెట్, స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. తాజాగా దర్శకుడు అట్లీ చేసిన ఓ ఆసక్తికర వ్యాఖ్య ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం యువ నటి ప్రీతీ ముకుందన్ను సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ అవకాశం దక్కలేదని అట్లీ స్వయంగా వెల్లడించారుప్రీతీ ముకుందన్ ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అందంతో పాటు యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆకట్టుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అంతకుముందు తెలుగు చిత్రం 'కన్నప్ప' లో కనిపించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. 'బ్లాస్ట్' విజయానంతరం ఆమెకు వరుసగా పలు భాషల్లో అవకాశాలు వస్తుండటంతో ప్రస్తుతం ప్రీతీ బిజీ హీరోయిన్‌గా మారిపోయారు. తాజాగా జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అట్లీ.. 'రాకా'కు సంబంధించిన ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లో ఒక ముఖ్యమైన పాత్ర కోసం సంప్రదించామని, అయితే అప్పటికే ఆమెకు వరుస సినిమా కమిట్‌మెంట్లు ఉండటంతో డేట్లు కుదరక ఆ ప్రాజెక్ట్ చేయలేకపోయారని చెప్పారు. ప్రీతీ ముకుందన్ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్కు అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా ఏ తరహా పాత్రలో కనిపించబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. భారీ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకోణె నటిస్తుండటం కూడా ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.



# ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి

'ది ఇండియా స్టోరీ' కథ విని షాక్ అయ్యాను. అసలు మనం ఏం తింటున్నాం? ఇలా కల్తీ ఆహారం తింటే మన కుటుంబాల పరిస్థితేంటి? అని తలచుకుంటే రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు' అంటూ ఆందోళన వ్యక్తం చేసింది నటి కాజల్ అగర్వాల్. ఆమె ప్రధానపాత్ర పోషించిన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఆహార కల్తీ నేపథ్యంలో తెరకెక్కిన ఈచిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహించారు.కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో కాజల్ లాయర్‌గా నటించారు. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈసినిమా విడుదల కానున్నది. ఈసందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'ఆహారంలో కల్తీ గురించి విన్నాను కానీ, మరీ దాని తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో ఈ సినిమాలో నటించాక అర్థమైంది. ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి. వాస్తవానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాలో నటించినందుకు గర్వంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది కాజల్ అగర్వాల్.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450